మేడారంలో అమ్మవారి గద్దె వద్ద ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి

- దక్షిణాది కుంభమేళా సమ్మక్క జాతర
- కాంగ్రెస్ హామీలు ఆచరణ సాధ్యం కాదు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

ములుగు, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ)/ హనుమకొండ: దక్షిణ భారత దేశంలో కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆమె ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ములుగు జిల్లాకేంద్రంలోని గట్టమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క-సారలమ్మను దర్శించుకొని, పూజలు నిర్వహించారు. అంతకుముందు హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం పదేండ్లుగా మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని ప్రధాని మోదీకి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని గుర్తుచేశారు. ఉమ్మడి పాలనలో నిర్లక్ష్యానికి గురైన మేడారం జాతరకు బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మొదటిసారి జాతరకు రూ.100 కోట్లు కేటాయించామని, ఆ తర్వాత ప్రతీసారి రూ.75 కోట్ల చొప్పున కేటాయిస్తూ వసతులు కల్పించి ఘనంగా జాతర నిర్వహించినట్టు పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా బస్సులు నడిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్, కేసీఆర్ కృషితోనే రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చిందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పోరాటంతో గిరిజన యూనివర్సిటీ రాష్ట్రానికి రావడం సంతోషకరమని, అందుకోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.17 కోట్లు ఇచ్చి యూనివర్సిటీకి కావలసిన భూములను సమకూర్చిందని, రూ.850 కోట్లతో ఇప్పుడు యూనివర్సిటీ నిర్మాణాన్ని చేపట్టడం గర్వకారణం అన్నారు.

కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దు

పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని ఎమ్మెల్సీ కవిత సూచించారు. మళ్లీ మంచి రోజులు వస్తాయని, అప్పటివరకు ధైర్యంతో పార్టీ సిద్ధాంతాల మేరకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టంచేశారు. అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, పింఛన్లు రావడం లేదని లబ్ధిదారులు బాధ పడుతున్నారని అన్నారు. సింగరేణి ఎన్నికల్లో పార్టీ నిర్ణయం మేరకు పోటీ చేయలేదని చెప్పారు. కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు కేవలం 1.7 శాతం ఓట్లు తేడా వచ్చాయని, వంద రోజుల తర్వాత తమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు పసునూరి దయాకర్, మాలోత్ కవిత, ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, శంకర్ నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

షీటీమ్స్ మఫ్టీ.. ఉమెన్ సేఫ్టీ

ఫలించిన కేసీఆర్ ప్రభుత్వ ప్రయోగం

- సంవత్సరంలో 10,766 ఫిర్యాదులు
- ఎన్నారై సెల్ 400 ఫిర్యాదుల స్వీకరణ
- రాష్ట్రంలో ఆపరేషన్ ముస్కాన్, స్మైల్‌తో 5,572 మంది చిన్నారులకు విముక్తి

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఆకతాయిల ఆటకట్టించేందుకు మహిళలకు, విద్యార్థినులకు భద్రత కల్పించేందుకు కేసీఆర్ హయాంలో పోలీసు శాఖ తీసుకొచ్చిన 'ఉమెన్ సేఫ్టీ వింగ్' సత్ఫలితాన్నిస్తున్నది. 2014 అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ విభాగం దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఆడవారికి ఏదైనా ఆపదొస్తే 'షీ టీమ్స్' గుర్తుకొచ్చేలా వ్యవస్థ ఏర్పాటైంది. బస్టాప్‌లు, రైల్వేస్టేషన్లు, థియేటర్లు, జాతరలు, పండుగలు ఏవైనా సరే మఫ్టీల్లో మహిళా పోలీసులు విధులు నిర్వర్తించి పోకిరీల ఆటకట్టించారు. ఈ ఏడాది ఉమెన్ సేఫ్టీ వింగ్‌లోని షీటీమ్స్ విభాగానికి 10,766 ఫిర్యాదులు అందగా.. తీవ్రతను బట్టి 850 కేసులు నమోదు చేశారు. మహిళల భద్రత, ఇతర అంశాలపై 2,146 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ వింగ్‌లోనే ఉన్న 'భరోసా' విభాగం బాధితులను అక్కున చేర్చుకొని సాంత్వన కలిగిస్తున్నారు. ఈ ఏడాది భరోసా కేంద్రాల ద్వారా 52 మందికి శిక్షలు విధించారు. 'ఇన్వెస్టిగేషన్ ట్రాకింగ్ సిస్టమ్ ఫర్ సెక్సువల్ అఫెన్సెస్' (ఐటీటీఎస్‌వో) ద్వారా అత్యాచార కేసుల స్థితిగతులను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. పని ప్రదేశాల్లో మహిళలు వేధింపులకు గురికాకుండా 'సాహస్' అనే (మాడ్యూల్) తీసుకొచ్చారు. ఆయా కంపెనీల యజమానులు, పోలీసుల సమక్షంలో ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేశారు. 38 ప్రాంతాల్లో వేధింపుల నివారణపై శిక్షణ ఇచ్చారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలని గత ప్రభుత్వం 'సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫాం' (సీఏపీ)ని తీసుకొచ్చింది. ఎన్నారై మహిళల నుంచి ఇప్పటివరకు 400 ఫిర్యాదులు స్వీకరించి 104 కేసులను పరిష్కరించింది. ట్రాన్స్‌జెండర్ల కోసం 'మైడ్ ప్లేస్ సెల్' ఏర్పాటు చేసి ఈ ఏడాది 13 కేసుల్లో వారిని వేధిస్తున్న పోకిరీల భరతం పట్టారు. మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఉమెన్ సేఫ్టీ వింగ్‌లోని 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్' (ఏహెచ్‌టీ) మాడ్యూల్ తీవ్రంగా శ్రమిస్తున్నది. ఈ ఏడాది 287 హ్యూమన్ ట్రాఫికింగ్ కేసులు నమోదు కాగా.. వాటిల్లో 557 మంది బాధితులను రక్షించారు. కాగా 364 మంది ట్రాఫికర్స్‌ను అరెస్టు చేశారు. ఈ ఏడాది ఆపరేషన్ స్మైల్ ద్వారా 2,955 మంది, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 2,617 మంది చిన్నారులను రక్షించారు.

లోకం పోకడ

అసలే మళ్లీ కరోనా.. ఇయర్ ఎండ్ పార్టీ అంటూ తాగి తందనాలు ఆడకుండా మాస్కు రెండింటికి పనికొచ్చేలా గట్టిగా కట్టా!

మెదడుపై కరోనా ప్రభావం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): దీర్ఘకాల కొవిడ్ బాధితుల్లో నరాల సంబంధిత వ్యాధులు వస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. ఒత్తిడి, ఆందోళనతోపాటు ఇతర మానసిక సమస్యలు ఎదురవుతున్నట్టు గుర్తించారు. 345 మందిపై పరీక్షలు చేయగా, దీర్ఘకాలిక కొవిడ్‌కు గురైన వారిలో మెదడు పనితీరు తేడాగా ఉన్నదని డెన్మార్క్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కొపెన్‌హెగెన్ పరిశోధకులు వెల్లడించారు. వారిని ఏడాదిపాటు పరీక్షించగా డిప్రెషన్ లక్షణాలు క్రమంగా పెరుగుతున్నాయని వివరించారు.

ఎంజీఎంలో ఐదుగురు చిన్నారులకు కరోనా

- పెద్దపల్లి జిల్లాలో ముగ్గురికి

వరంగల్ చౌరస్తా/జ్యోతినగర్, డిసెంబర్ 30: రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్ ఎంజీఎం వైద్యశాలకు వచ్చిన ఐదుగురు చిన్నారులను పరీక్షించగా పాజిటివ్ అని తేలడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఇందులో నలుగురిది ఒకటి నుంచి రెండేండ్ల మధ్య వయస్సే. నలుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో హోం ఐసోలేషన్‌కు పంపారు. ఒక్కరిని మాత్రమే అడ్మిట్ చేసుకున్నారు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ముగ్గురికి కరోనా పాజిటివ్ వచ్చింది.

నకిలీ మందుల తయారీ రాకెట్ గుట్టురట్టు

- భారీగా మందులు, లేబుళ్లు స్వాధీనం
- నిజామాబాద్‌కు పార్శిళ్లలో సరఫరా
- అక్కడ కూడా అధికారుల సోదాలు
- రూ.6 లక్షల నకిలీ మందులు సీజ్

వినాయక్‌నగర్‌లోని ఓ మెడికల్ షాపులో అధికారులు స్వాధీనం చేసుకున్న నకిలీ మందులు

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ)/ఖలీల్‌వాడి/ నిజామాబాద్ క్రైం: తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) మేడ్చల్ అధికారులు శనివారం కూకట్‌పల్లిలో నకిలీ మందుల తయారీ రాకెట్‌ను ఛేదించారు. మూసాపేటలో రామ్స్ ఫార్మాస్యూటికల్స్ పేరుతో కొనసాగుతున్న ఈ కంపెనీ డ్రగ్ లైసెన్సులు లేకుండానే పంజాబ్‌కు చెందిన కంపెనీ పేరుతో నకిలీ యాంటీ అల్సర్ మందులను తయారు చేస్తున్నది. కౌచిక రంజిత్‌కుమార్, మాడా పవన్, షేక్ సుభానీ తదితరులు మూసాపేట రాజీవ్‌గాంధీనగర్‌లోని రామ్స్ ఫార్మాస్యూటికల్స్‌లో ఈ నకిలీ మందులను తయారుచేస్తున్నట్టు డీసీఏ అధికారులు తెలిపారు. తమకు అందిన సమాచారంతో శనివారం ఆకస్మిక తనిఖీలు చేయగా, నకిలీ మందుల తయారీ బాగోతం బయటపడినట్టు చెప్పారు. ఫుడ్ లైసెన్సుతో నకిలీ మందులను తయారుచేస్తున్నట్టు పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో నకిలీ మందులను, లేబుళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ప్రొడక్షన్ ఆపరేటర్‌గా పని చేస్తున్న షేక్ సుభానీని ప్రశ్నించగా, నకిలీ మందులను నిజామాబాద్ వినాయక్‌నగర్ పరిధి శ్రీనగర్ కాలనీలో బయోమెట్రిక్ ఫార్మాసిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటుచేసిన ఏజెన్సీకి సరఫరా చేస్తున్నట్టు తెలిపినట్టు వెల్లడించారు. నిజామాబాద్ లోని డీసీఏ అధికారులకు సమాచారం అందించడంతో వారు వెంటనే ఏజెన్సీపై దాడులు నిర్వహించి రూ.6 లక్షల విలువైన 29,600 నకిలీ మందుల క్యాప్సుల్స్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు. నకిలీ మందులు విక్రయిస్తున్న ఏజెన్సీ డైరెక్టర్ కే రజిత్‌కుమార్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్టు తెలిపారు.

ప్లాస్టిక్ సర్జన్ లక్ష్మికి అరుదైన గుర్తింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబరు 30 (నమస్తే తెలంగాణ): జాతీయ స్థాయిలోని నాబి (నేషనల్ అకాడమీ ఆఫ్ బర్న్ ఇంజురీస్), ఆప్సీ (అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జన్స్ ఆఫ్ ఇండియా)లకు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ప్లాస్టిక్ సర్జరీ విభాగం నుంచి ప్రొఫెసర్ పలుకూరి లక్ష్మీ ఎంపికయ్యారు. రెండు జాతీయ స్థాయి అసోసియేషన్‌లకు ఒకే సంవత్సరంలో ఎన్నిక కావడం ఉస్మానియా చరిత్రలో ఇదే తొలిసారి. డాక్టర్ లక్ష్మి సేవలను గుర్తించిన నాబి, ఆప్సీలు ఆమెను ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నుకున్నాయి.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	10.5°c	32.6°c
మెదక్	12.5°c	31.6°c
రంగారెడ్డి	14.2°c	30.1°c
నల్లగొండ	15.0°c	29.5°c
వరంగల్	16.0°c	29.0°c
కరీంనగర్	16.0°c	29.0°c
నిజామాబాద్	16.6°c	29.9 °c
హైదరాబాద్	16.9°c	30.0°c
ఖమ్మం	17.0°c	30.0°c
మహబూబ్‌నగర్	18.1°c	32.2°

సమన్వయలోపాన్ని సరిదిద్దండి

- ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలపై తపస్ నేతల వినతి

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), ఉన్నతి వంటి కార్యక్రమాల్లో తలెత్తుతున్న సమన్వయలోపాన్ని సరిదిద్దాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కోరింది. శనివారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తపస్ నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యాశాఖ కమిషనరేట్ నుంచి వచ్చే సమాచారం ఒకరకంగా, డీఈవోలు మరో రకంగా సమాచారాన్ని ఇస్తుండటంతో గందరగోళం నెలకొంటున్నదని, దీనిని సమీక్షించి లోపాలను సరిదిద్దాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, సురేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉషారాణి, పెంట య్య, కళావతి, కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారుల సంఘాన్ని రద్దు చేయండి

- కొత్త సంఘానికి ఎన్నికలు నిర్వహించండి
- డీజీపీకి మాజీ సభ్యుల వినతి

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం ఉన్న తాత్కాలిక పోలీస్ అధికారుల సంఘాన్ని రద్దు చేసి, కొత్త సంఘం కోసం ఎన్నికలు నిర్వహించాలని డీజీపీ రవిగుప్తా, ఐజీపీ పర్సనల్‌కు రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం మాజీ కోశాధికారి జీఎస్ రాజు తదితరులు విన్నవించారు. శనివారం డీజీపీ కార్యాయలంలో రవిగుప్తాకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రస్తుత, మాజీ సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సంఘాన్ని రద్దు చేస్తామని, త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని డీజీపీ హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఇక నుంచి సిబ్బందికి సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తనను కలవొచ్చిన డీజీపీ చెప్పినట్టు వారు తెలిపారు. ఇకనుంచి పోలీసుల సమస్యలు పరిష్కారం కోసం ప్రత్యేకంగా దర్బార్‌ను నిర్వహించే ఆలోచన చేస్తున్నట్టు డీజీపీ చెప్పారని పేర్కొన్నారు. డీజీపీని కలిసిన వారిలో బెటాలియన్ల తరపున జంగయ్య, సంగారెడ్డి నుంచి జనార్దన్, సుభాష్, హైదరాబాద్ నుంచి అప్పలసూరి, నరేందర్, ఖమ్మం నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి శ్రీనివాస్‌గౌడ్, సైబరాబాద్ నుంచి మల్లేశ్ తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 39.24 లక్షల కేసుల పరిష్కారం

- రూ.190 కోట్ల మేర లబ్ధిదారులకు చెల్లింపులు

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యాప్తంగా శనివారం అన్ని స్థాయి కోర్టుల్లో నిర్వహించిన లోక్‌అదాలత్‌లకు అనూహ్య స్పందన లభించింది. పలు వివాదాల్లో ఇరుపక్షాలు ఏకాభిప్రాయానికి రావడంతో లబ్ధిదారులకు రూ.320 కోట్ల మేరకు అవార్డుగా చెల్లింపులకు ఉత్తర్వులు వెలువడ్డాయి. హైకోర్టు, జిల్లా కోర్టులు, ఇతర కోర్టుల్లో 39,24,107 కేసులు పరిష్కారం అయ్యాయి. వాటిలో ప్రీలిటిగేషన్ కేసులు 32,65,220, పెండింగ్ కేసులు 6,58,887 చొప్పున ఉన్నాయి. హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, న్యాయమూర్తులు జస్టిస్ పీ శ్యామ్ కోశ్టి, జస్టిస్ టీ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో లోక్‌అదాలత్‌ల నిర్వహణ జరిగినట్టు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎస్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

నూతన ఏజీగా సుదర్శన్‌రెడ్డి

- గవర్నర్ ఆమోదం.. ఉత్తర్వులు జారీ
- ఈ పదవి ఆయనకు ఇది రెండోసారి

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా హైకోర్టు సీనియర్ న్యాయవాది ఏ సుదర్శన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ఆర్ తిరుపతి శనివారం జీవో 636 జారీ చేశారు. ఏజీగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆయన నియామకం అమల్లోకి రానుంది. ఉమ్మడి రాష్ట్రంలో చివరి సీఎం ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో సుదర్శన్‌రెడ్డి ఏజీగా పనిచేశారు. ఇప్పుడు తిరిగి రెండోసారి అదే పదవిని పొందారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సిఫారసుకు గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. ప్రస్తుత జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం రేచ్‌పల్లిలోని వ్యవసాయ కుటుంబంలో జగపతిరెడ్డి, బుచ్చమ్మ దంపతులకు 1959 జూలై 25న సుదర్శన్‌రెడ్డి జన్మించారు. ఆయనకు భార్య రేణుక, పిల్లలు మహిత, ఆదిత్య ఉన్నారు. సెయింట్ పాల్స్ స్కూల్‌లో పాఠశాల విద్యనభ్యసించిన సుదర్శన్‌రెడ్డి నిజాం కాలేజీ నుంచి డిగ్రీ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం అభ్యసించారు. బార్ కౌన్సిల్‌లో 1985లో న్యాయవాదిగా చేరిన ఆయనకు అన్ని కోర్టుల్లోనూ వాదించిన అనుభవం ఉంది. 2011- 2014 మధ్యకాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో చివరి అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఏజీగా ఉన్న బీఎస్ ప్రసాద్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయన రాజీనామా చేశారు. అదనపు అడ్వకేట్ జనరల్‌గా తేరా రజనీకాంత్‌రెడ్డిని ప్రభుత్వం ఇప్పటికే నియమించింది.

ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా జగదీశ్వర్

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడిగా టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 28 నుంచి 30 వరకు కోల్‌కతాలో నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశాల్లో జగదీశ్వర్‌కు నూతన బాధ్యతలు అప్పగించారు. ఈ సభలకు తెలంగాణ నుంచి 200 మంది టీఎన్జీవో నేతలు హాజరయ్యారు. మారం జగదీశ్వర్‌కు అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణగౌడ్, కోశాధికారి రామినేన శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్‌హుస్సేని శుభాకాంక్షలు తెలిపారు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

నేషనల్ ఇన్సూరెన్స్‌లో...

ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 274
- పోస్టులు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్
- విభాగాలు: స్పెషలిస్ట్, డాక్టర్స్, లీగల్, ఫైనాన్స్, యాక్చురియల్, ఐటీ, ఆటోమొబైల్ ఇంజినీర్స్, హిందీ ఆఫీసర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 22
- వెబ్‌సైట్: https://nationalinsurance.nic.co.in

ఐఆర్ఎఫ్‌సీలో...

ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 63
- పోస్టులు: చీఫ్ కంప్లైన్స్ ఆఫీసర్ (సీసీవో)
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: జనవరి 18
- వెబ్‌సైట్: www.irfc.co.in

ఇస్రోలో...

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 54
- పోస్టులు: టెక్నీషియన్
- అర్హతలు, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 31
- వెబ్‌సైట్: https://www.isro.gov.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జనరల్ సైన్స్, జాగ్రఫీ, జనరల్ స్టడీస్ (గ్రూప్స్ డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

9.67% తగ్గిన అగ్నిప్రమాదాలు

- 2,093 మంది ప్రాణాలు.. 918 కోట్ల ఆస్తి కాపాడిన అగ్నిమాపక శాఖ
- వార్షిక నివేదిక విడుదల చేసిన ఏడీజీ నాగిరెడ్డి

తొలిసారిగా ఎన్డీఆర్ఎఫ్ ఏర్పాటు

గత ప్రభుత్వం తొలిసారిగా అగ్నిమాపకశాఖలో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్)ను తీసుకొచ్చినట్లు నాగిరెడ్డి తెలిపారు. ఇటీవల సంభవించిన వరదల్లో ఎక్కువమందిని కాపాడేందుకు తమ సిబ్బంది అహర్నిశలు కృషి చేసినట్లు తెలిపారు. ఈ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో తోడు అగ్నిమాపక సిబ్బంది సుమారు 1,421 మందిని వరదల నుంచి రక్షించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది పదివేలకు పైగా అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. 4,445 మాక్ డ్రిల్స్ తమ శాఖ నిర్వహించిందని చెప్పారు. టీఎస్ఎల్‌పీఆర్బీ ద్వారా 26 స్టేషన్ ఫైర్ ఆఫీసర్లను నియమించామన్నారు.

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యాప్తంగా ఈ యేడాది 9.67% అగ్నిప్రమాదాలు తగ్గాయని ఆ శాఖ ఏడీజీ వై నాగిరెడ్డి తెలిపారు. శనివారం అగ్నిమాపక శాఖ వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ డిపార్ట్‌మెంట్ దేశంలోనే అతిపెద్ద ఫైర్ సర్వీసెస్‌లలో ఒకటిగా అవతరించిందని చెప్పారు. అగ్నిమాపకశాఖలో 137 ఫైర్‌స్టేషన్లు, 9 ఫైర్ అవుట్ పోస్టులు ఉండగా, 33 జిల్లాల్లో 2,734 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

అగ్నిప్రమాదాల వివరాలు

ప్రమాదాలు	2022	2023	ప్రమాదశాతం
తీవ్రమైనవి	104	108	3.84% పెరిగాయి
మధ్యస్థమైనవి	135	150	11.1% పెరుగుదల
చిన్న ప్రమాదాలు	7,129	6,377	10.5% తగ్గుదల
ఫైర్ రెస్క్యూ/ఎమర్జెన్సీ	574	539	6.09% తగ్గుదల
మొత్తం	7,942	7,174	9.67% తగ్గుదల
కాపాడిన ప్రాణాలు	934	2,093	124% పెరుగుదల
కాపాడిన ఆస్తి (కోట్లలో)	రూ.723.14	రూ.918.69	27% పెరుగుదల

భారీగా సైబర్ క్రైం మోసాలు

- ఈ ఏడాది 85,030 కేసుల నమోదు
- 707 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సైబర్ క్రైం మోసాలు భారీగా పెరిగాయి. సైబర్ నేరాల పట్ల పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా ప్రతి రోజు ఎక్కడో ఓ చోట సైబర్ నేరగాళ్ల చేతుల్లో అమాయకులు మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 30న సైబర్ నేరాల అదుపునకు ప్రత్యేకంగా 'తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో'ను ఏర్పాటు చేసింది. 2022లో సుమారు 50 వేల సైబర్ క్రైమ్ ఫిర్యాదులు నమోదు కాగా.. ఈ ఏడాది 85,030 ఫిర్యాదులు అందాయి. వీటిల్లో ఆర్థికపరమైన సైబర్ క్రైమ్స్ 65,877 ఉండగా, ఇతర ఫిర్యాదులు 19,153 ఉన్నాయి. అయితే, 1930కు వచ్చిన ఫిర్యాదుల నుంచి తెలంగాణ పోలీసులు 12,317 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, దేశంలోనే మొదటి స్థానంలో నిలిచారు. ఈ మొత్తం ఫిర్యాదుల్లో రూ.707,25,75,547 నగదు సైబర్ మోసగాళ్ల అకౌంట్లకు చేరగా, రూ.114.72 కోట్ల నగదును పోలీసులు హోల్డ్ చేయగలిగారు. వీటిల్లో నిజమైన బాధితులను గుర్తించి రూ.7.29 కోట్ల నగదును అప్పగించారు. 149 కేసుల్లో నిందితులను అరెస్టు చేశారు. అనుమానాస్పద లావాదేవీల్లో 28,610 సిమ్‌కార్డులను బ్లాక్ చేశారు. సైబర్ మోసానికి గురైతే 1930కు కాల్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

అందుబాటులోకి డ్రగ్ టెస్టింగ్ కిట్లు

- ఒక్కో కమిషనరేట్‌కు 25 అందజేత
- లాలాజలం, మూత్రంతో డ్రగ్ టెస్టింగ్
- పాజిటివ్ రిపోర్టు వస్తే కటకటలా వెనక్కే

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): నూతన సంవత్సర వేళ డ్రగ్స్ వాడకాన్ని పూర్తిగా అరికట్టేందుకు తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో (న్యాబ్) గట్టి చర్యలు చేపట్టింది. తెలంగాణ వ్యాప్తంగా అన్ని కమిషనరేట్ల పరిధిలో డ్రగ్స్ టెస్టింగ్ కిట్లను ప్రవేశపెట్టింది. ఒక్కో పోలీస్ కమిషరేట్‌కు 25 కిట్ల చొప్పున ఇప్పటికే పంపిణీ చేసినట్టు నార్కోటిక్ బ్యూరో ఏడీజీ సందీప్ శాండిల్య తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో డ్రగ్స్ డిటెక్షన్ టెస్ట్ కిట్స్‌తో పరీక్షిస్తామని చెప్పారు. ఆదివారం ఉ